క్లుప్తంగా

ఐటీ కంపెనీల రాకతో యువతకు ఉపాధి

కైలాస్‌నగర్: ఐటీ కంపెనీల రాకతో జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని తాత్కాలిక భవనంలో నిర్వహించనున్న ఐటీ ఎన్‌టీటీ డేటా కంపనీ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించారు. ఏడాదిన్నర కిందట బీడీఎన్‌టీ కంపెనీని ప్రారంభించగా.. తాజాగా డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఐటీ టవర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 40కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీటీ డేటా కంపనీ ఎండీ సంజీవ్ దేశ్‌పాండే, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, కల్పన, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జైనథ్: మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ.. ఆర్థికంగా ఎదగాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని దీపాయిగూడ గ్రామంలో న్యాక్ సిబ్బందితో కలిసి మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పన్ లింగారెడ్డి, బొల్లి గంగన్న, మెట్టు ప్రహ్లాద్, రాంరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

‘విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం’

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని వసతి గృహాల్లో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మెస్రం భాస్కర్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొమురంభీం చౌక్ వద్ద గల ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహాన్ని సందర్శించి మాట్లాడారు. వసతి గృహ విద్యార్థినుల సమస్యలు పరిష్కరించి నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు కోవా వేణుగోపాల్, టీకం గణేశ్ తదితరులున్నారు.

‘పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయవద్దు’

తలమడుగు: పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని దేవపూర్ గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రిజిస్టర్ పరిశీలించారు. పనులు చేపట్టిన తరువాత రిజిస్టర్‌లో పనులు నమోదు చేయాలన్నారు.

పోడు పట్టాలు అందించాలి

నేరడిగొండ: అర్హులకు పోడు పట్టాలు అందించాలని బోరిగాం గ్రామస్తులు కోరారు. గురువారం జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పోడుపట్టాలు పంపిణీ వివిధ కారణాలతో ఆగిపోయిందన్నారు. అర్హులైన మిగితా రైతులందరికీ పట్టాలు పంపిణీ చేయాలన్నారు. పవన్, సీతారాం, మంగు, గోపి, దేవేందర్ రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

వసతులు కల్పించాలి

నేరడిగొండ: మండల కేంద్రంలో వారసంతలో వసతులు కల్పించాలని నేరడిగొండ వార్డుసభ్యులు సాబ్లే సంతోశ్‌సింగ్, రాథోడ్ రాజేశ్వర్ లు కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంపీవో శోభన, సర్పంచ్ పెంట వెంకట రమణ, పంచాయతీ కార్యదర్శి రాఘవలకు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఆదాయం వస్తున్నా.. కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. వ్యాపారులు కూర్చునే ప్రదేశమంతా బురదమయంగా మారిందన్నారు.

రిమ్స్‌ను సందర్శించిన ఏజెన్సీ అడిషనల్ డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: ఏజెన్సీ అడిషనల్ డీఎంహెచ్‌వో బాలు గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ను సందర్శించారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజనులు రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా ఆయా వార్డులకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

శివాలయంలో నాగుపాము



మండల కేంద్రానికి సమీపంలోని భవానిగిరి గుట్ట వద్ద ఉన్న శివాలయంలో గురువారం నాగుపాము దర్శనమిచ్చింది. గర్భగుడి వద్ద ఉన్న రేకుల షెడ్డుపై గంటపాటు పడవ విప్పి ఉండటంతో ఆలయ వ్యవస్థాపకుడు పోచ్చన్న మహరాజ్ ఫోన్‌లో వీడియో తీశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, భక్తులు భారీగా తరలివచ్చి నాగుపామును దర్శనం చేసుకున్నారు. - తాంసి

అంగన్‌వాడీలో ఆటవస్తులేవి?

- కనిపించని ప్రీ స్కూల్ కిట్స్
- ఆటలకు దూరంగా చిన్నారులు
- పర్యవేక్షించని అధికారులు



మూలను పడేసిన ఆట వస్తువు



అంగన్‌వాడీలో భోజనం చేస్తున్న చిన్నారులు

తలమడుగు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటలు కనుమరుగయ్యాయి. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఆటల రూపంలో బోధించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం ప్రతీ అంగన్‌వాడీకి ప్రీస్కూల్ కిట్స్ అందజేసింది. కానీ వాటిని ఎక్కడ వినియోగించడం లేదు. కొన్ని అంగన్‌వాడీల్లో కనీసం కనిపించడం లేదు. తలమడుగు మండలంలో 52 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో 1200 మంది చిన్నారులున్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి జిల్లా శిశు మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ప్రీస్కూల్ కిట్స్ అందజేస్తారు. ఇందులో 15 రకాల ఆట వస్తువులు ఉంటాయి. పిల్లలు మానసికంగా ఎదిగేందుకు ఉపయోగపడేలా వీటిని రూపొందించారు. రింగ్, రంగులను గుర్తించే వస్తువులు, బాల్, ప్లాస్టిక్ వస్తువులు, ఇల్లు కట్టడం తదితర ఆట వస్తువులను అంగన్‌వాడీ పిల్లల కోసం ప్రత్యేకంగా తయారు చేయించారు.

నిరుపయోగంగా ప్రీస్కూల్ కిట్స్..

ప్రీస్కూల్ కిట్స్ పిల్లలు అంగన్‌వాడీలకు వచ్చేందుకు ఆకర్షించే విధంగా ఉంటాయి. మూడు నుంచి ఐదేళ్ల వయస్సులోపు పిల్లలు కేంద్రాలకు రావడానికి మారం చేస్తుంటారు. అలాంటి పిల్లలు కేంద్రాలకు వచ్చేలా వారిని ఆటలు ఆడిస్తూ.. ప్రాథమిక విద్య బోధించేలా వస్తువులు తయారు చేశారు. కానీ ఆట వస్తువులను ఎక్కడా ఉపయోగించడం లేదు. వచ్చిన పిల్లలకు భోజనం పెట్టి పంపిస్తున్నారు. అధికారులు పర్యవేక్ష లేకపోవడం, సరైనా సౌకర్యాలు లేక చిన్నారులకు ఆటలు ఆడించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రీస్కూల్ కిట్స్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉపయోగించేలా చూస్తాం

అంగాన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసిన ప్రీ స్కూల్ కిట్లను ఉపయోగించేలా చర్యలు తీసుకుంటాం. కేంద్రాలను పరిశీలించే సమయంలో వాటిని ఉపాయోగిస్తున్నారా? లేదా? అని పరిశీలిస్తాం. చిన్నారులను అంగన్‌వాడీకి తీసుకువచ్చే విధంగా ఉపయోగపడుతాయి.
- విజయ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్: రైతులకు మూడు గంటల కరెంట్ చాలు అన్న టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే జోగు రామన్న డిమాండ్ చేశారు. నిరాల, పెండల్‌వాడ గ్రామాల్లోని రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, వైస్ ఎంపీపీ సావాపూరే విజయ్, సర్పన్ లింగారెడ్డి, రోకండ్ల రమేశ్, చంద్రయ్య పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఆదిలాబాద్‌టౌన్: ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో మహా గణపతి ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న షెడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. షెడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు అందిస్తానని చెప్పడంతో ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ముందుగా మహా గణపతిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ బండారి సతీశ్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొత్తావార్ రాజేశ్వర్, రామ్ పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తాంసి: రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం భీంపూర్ మండలంలోని నిపాని రైతువేదికలో మూడు గంటల కరెంట్.. మూడు పంటలు కావాలా అనే అంశంపై చర్చ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని పండుగలా మార్చిందని సీఎం కేసీఆర్ అని అన్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, గిట్టుబాటు ధర కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు. అనంతరం బెల్సరీరాంపూర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సవారీ బంగ్లా షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నప్రభ సంతోశ్, రైతుబంధు సమితి అధ్యక్షుడు అనిల్, కన్వీనర్ నాగయ్య, లింబాజీ, కిరణ్, సర్పంచ్‌లు రాజన్న, రూప శంకర్, గంగయ్య పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ శరత్ బాబు, ఉద్యోగులు అనిల్ కుమార్, నాగరాజు, విద్యాసాగర్, శివకుమార్, నరేశ్, మనోహర్, సంజీవ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడుదాం

ఇంద్రవెల్లి: బాలల హక్కులను ప్రతిఒక్కరూ కాపాడాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా బాలల పరిక్షణ కమిటీ ఆధ్వర్యంలో ముత్నూర్ గ్రామాన్ని బాలల స్నేహపూర్వక గ్రామంగా ఎంపిక చేసి, సర్పంచ్ తుంరం బాగుబాయి అధ్యక్షతన బాలల హక్కుల కరపత్రాలు ఆవిష్కరించారు. బడీడు పిల్లలందరిని బడికి పంపించాలని, బాల్య వివాహాలు చేయవద్దన్నారు. బాలల సమస్యలను కమిటీ ఆధ్వర్యంలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనాథ బాలలను గుర్తించి వారికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుంతం బాగుబాయి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి

ఆదిలాబాద్‌టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని వైఎస్సార్ టీపీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్ అన్నారు. పార్టీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా అసిఫ్ హుస్సేన్‌ను నియమిస్తూ గురువారం జిల్లా కేంద్రంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. బడుగు, బలహీన వర్గాల కోసం వైఎస్సార్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పెందుర్ మనోహర్, పట్టణ అధ్యక్షుడు షేక్ అస్లం, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిరికొండ: మండలంలోని రాంపూర్(బి) గ్రామంలో ఎన్నికల్లో ఉపయోగించే ఈవీఎం, వీవీప్యాట్‌లపై అధికారులు అవగాహన కల్పించారు. ఈవీఎం ద్వారా ఎలా ఓటు వేయాలో వివరించారు. సర్పంచ్ తాంబరే రేణుక బాయి, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ శంకర్, బీఎల్‌వో సూపర్‌వైజర్ సెడ్మాకీ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి నాగ భూషన్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు వేసేందుకు అర్హులని డిప్యూటీ తహసీల్దార్ భుజంగ్ రావు అన్నారు. గురువారం మండలంలోని చింతకర్ర, సాకెర గ్రామాల్లో ఈవీఎం పరికరాల పనితీరు గురించి వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

విలాస్‌రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న మిత్రులు

ఇచ్చోడ: మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన కాటిపెల్లి విలాస్ రెడ్డికి గురువారం 1986– 87 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు నివాళులర్పించారు. గత రెండు రోజుల కిత్రం ఆదిలాబాద్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బోరిగామలోని ఆయన స్వగృహంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడె మానాజీ, క్లెం దయకూమార్‌రెడ్డి, అమృత్‌రెడ్డి, సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డి మృతి తీరని లోటు

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి చిల్కూరి రాంచంద్రారెడ్డి అకాల మరణం తీరని లోటని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ఎంపీ సోయం బాపురావులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేసి, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పని చేశారని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా.. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

బోథ్: మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

రోడ్డుకు మరమ్మతులు

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) రోడ్డుకు గురువారం మరమ్మతులు చేపట్టారు. గత నాలుగు సంవత్సరాల కిందట ఇచ్చోడ నుంచి సొనాల వరకు బీటీ రోడ్డు నిర్మించారు. కానీ అడేగామ(కె) రోడ్డు నిర్మించకుండా వదిలేశారు. దీంతో వర్షాకాలంలో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల గ్రామస్తులు మాజీ ఎంపీ గోడం నగేశ్‌ను విన్నవించారు. ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కైలాస్‌నగర్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శలు ఎస్.శశికాంత్, ఎన్.దయాకర్ రెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఏవో అరవింద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రిటైర్డు ఎంప్లాయిస్‌కు ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.బాపురావు, జగన్, దేవిదాస్, రాజవర్ధన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఏది?



వంతెనను పరిశీలిస్తున్న గండ్రత్ సుజాత

జైనథ్: ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే జోగురామన్నకు చిత్తశుద్ధి లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత్ విమర్శించారు. గురువారం నాయకులతో కలిసి మండలంలోని తరోడ గ్రామం వద్ద కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. తరోడ వంతెన గతంలోనే కుంగిపోయినప్పటికీ, ఇంతవరకు నూతన వంతెన నిర్మాణం చేపట్టలేదన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, రైతుల ఇబ్బందులు ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడిచర్ల సుదర్శన్, పిడుగు స్వామి, లస్మన్న యాదవ్, సురేశ్‌రెడ్డి, వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ రాథోడ్ సజన్

నేరడిగొండ: ఉపాధిహామీ పనులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. గురువారం నేరడిగొండ మండల కేంద్రంలోని రైతువేదికలో 2021–23 వరకు ఉపాధిహామీ ద్వారా చేపట్టిన పనులపై 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీపీ రాథోడ్ సజన్, డీఆర్‌డీఏ కిషన్, ఏపీడీ రాథోడ్ రవీందర్, అసిస్టెంట్ పీడీ సిద్దీఖ్‌లు హాజరయ్యారు. 32 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.34 కోట్ల 84 లక్షలు మంజూరయ్యాయని, అందులో నుంచి రూ.19 కోట్ల 54 లక్షలు ఉపాధిహామీ పథకం ద్వారా ఖర్చు చేయడం జరిగిందన్నారు. 1461 పనులను గ్రామాల్లో చేపట్టడం జరిగిందన్నారు. 7800 మంది కూలీలు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను బీఆర్పీలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎస్టీఎం నరేందర్, ఎస్ఆర్పీ కొమురయ్య, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న సామాజిక ప్రజావేదిక

నేరడిగొండ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. 32 గ్రామ పంచాయతీలకు సంబంధించిన పనుల వివరాలను చదివి వినిపించాల్సి ఉండగా.. 20 గ్రామ పంచాయతీలవి పూర్తయ్యాయి. మిగితా 12 గ్రామపంచాయతీల సమాచారాన్ని శుక్రవారం అడిట్ బృందం చదివి వినిపించనున్నట్లు డీఆర్‌డీఏ కిషన్ తెలిపారు. బందంరేగడి, పీచర, నారాయణపూర్, కుంటాల(బి), కుమారి, చిన్న బుగ్గారం, లింగట్ల, బోరిగాం, బుగ్గారం, తేజాపూర్, రోల్‌మామడ, నేరడిగొండ గ్రామపంచాయతీలకు సంబంధించిన వివరాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

‘ప్రతిపక్షాలను నమ్మి మోసపోవద్దు’



మాట్లాడుతున్న మాజీ ఎంపీ నగేశ్

బోథ్: ప్రతిపక్షాల మాటలను నమ్మి మోసపోవద్దని మాజీ ఎంపీ నగేశ్ అన్నారు. గురువారం మండలంలోని పార్డి(బి), పార్డి (కె), చింతలబోరి, దేవుల్ నాయక్‌తండా, వజ్జర్, గొల్లాపూర్ గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ నాయకులు మూడు గంటల విద్యుత్ మాత్రమే ఇస్తామని ప్రకటనలు చేస్తున్నారని, వారిని గ్రామాల్లోకి రానివద్దన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్ అందిస్తున్నామన్నారు. మళ్లీ ఆదివాసీలను మాటలతో మభ్యపెడుతున్నారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, తాంసి జెడ్పీటీసీ రాజు, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, ప్రశాంత్, వెంకన్న, ఆడె శీల, శ్రీధర్‌రెడ్డి, మారుతి పాల్గొన్నారు.

ఘనంగా సిడాం శంభు వర్ధంతి

ఇంద్రవెల్లి: ఆదివాసీ ఉద్యమ నాయకుడు తుడుందెబ్బ వ్యవస్థాపకులు సిడాం శంభు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సోయం రాందాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో సిడాం శంభు 5వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు పెందోర్ అంకుష్, పట్టణ అధ్యక్షుడు భవాళే కిరణ్, వావల్కర్ శివాజీ, సోన్‌కాంబ్లే సునీల్, మెస్రం మురారీ, మడావి లచ్చు, కాంబ్లే కోండిబా, సోయం మాధవ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: తుడుందెబ్బ వ్యవస్థాపకులు సిడాం శంభు 5వ వర్ధంతిని గురువారం మండలంలోని మత్తడిగూడలో నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, జెడ్పీటీసీ చారులత రాథోడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్, హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మర్సుకోల తిరుపతి, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ , తాటిగూడ కాలనీలలో గురువారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. దోమల వ్యాప్తి నియంత్రణకు మందు పిచికారీ చేయడంతో పాటు ఆయిల్‌బాల్స్‌ను వేశారు. ఆయావార్డుల్లో తిరుగుతూ పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. న్యాక్ శిక్షణ కేంద్ర ఆవరణలో మొక్కలు నాటారు. చెత్తను రోడ్లపై పడేయకుండా మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని సూచించారు. అంతకు ముందు మార్కెట్‌యార్డు నుంచి భాగ్యనగర్ వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సంజయ్, కోవ రవి, కొండ గణేశ్, నల్ల మహేందర్, ప్రకాశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరిహారం చెల్లించాలి

బోథ్: ఆకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ ఓబీసీ మోర్చా నియోజకవర్గ అధ్యక్షుడు తూము సూర్యం డిమాండ్ చేశారు. గురువారం రైతులతో కలిసి మాట్లాడారు. రైతులు కుమ్మరి రాజు, సింగం భోజారెడ్డి, కత్తూరి సతీష్, పోశెట్టి, నాగన్న, రైతులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సు విజయవంతం చేయండి

ఇచ్చోడ: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నర్సాపూర్ వైద్యాధికారులు హిమబింధు, సర్వరాజీలు కోరారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ సుశీల, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో బోనాల పండుగ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ అంగన్‌వాడీ కేంద్రం 7లో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ అన్ముల్‌వార్ కవిత బోనాలు ఎత్తుకొని నైవేద్యం సమర్పించారు. జ్యోతి, మీన, అనిత, అపర్ణ, సువర్ణ, సుజాత, పాయల్, సంగీత, డాలీ, సీమ, నేహా అన్జుమ్, తంకిన్, ఫర్హీన్ పాల్గొన్నారు.

బిల్లు ఇప్పించండి

నేరడిగొండ: మండలంలోని తర్నం(కె) గ్రామానికి చెందిన కామెరి రాజేశ్వర్ ఉపాధిహామీ పథకంలో పాఠశాల వంట గది నిర్మించాడు. ఆయనకు బిల్లులు రాకపోవడంతో గురువారం ప్రజావేదికపై తన గోడును వెల్లబోసుకున్నాడు. రూ.2 లక్షల 20 వేలతో వంట గది నిర్మించడం జరిగిందని, ఇప్పటివరకు రూ.72 వేల 228 మాత్రమే వచ్చాయన్నారు. బిల్లులు వచ్చేలా చూస్తామని పీడీ కిషన్, ఎంపీపీ రాథోడ్ సజన్ నచ్చజెప్పడంతో శాంతించారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

నార్నూర్: గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం గాదిగూడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 17 మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేశారు. వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ పవార్ రవీందర్, పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రానికి చెందిన పోశెట్టి అదృశ్యమైనట్లు ఏఎస్సై సవిత తెలిపారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న పోశెట్టి గురువారం మద్యం సేవించి ఇంటికి చేరుకున్నాడు. భార్యతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు గాలించినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి

ఆదిలాబాద్: డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ మయూర్ చంద్ర అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని వినాయక చౌక్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జోగు రవి, లోక ప్రవీణ్ రెడ్డి, ఆకుల ప్రవీణ్, సోమ రవి, దినేష్ మటోలియా పాల్గొన్నారు.